# బ్రహ్మరాక్షసులు

"ఏ లక్షాధికార్నిగాని, కోటీశ్వరుణ్ణిగాని బ్రహ్మరాక్షసి పట్టగా చూశారూ? ఎట్లా చూస్తారూ? బ్రహ్మరాక్షసులు దరిద్రుల్నీ, అమాయకుల్నీ, ఆర్తుల్నీ పట్టి రక్తం పీల్చేస్తాయి" అన్నారు గురువుగారు.

"ఎంచేతండీ గురువుగారు?" అన్నాం.

"దానికెన్నికారణాలన్నా చెప్పొచ్చు. కష్టాలు ఒంటరిగా రావనీ, తగిలిన వేలుకే తగుల్తుందనీ వినలా. కాని ముఖ్యమైన కారణం ఒకటుంది – బుద్ధిమంతులు తెలుసుకోవాల్సిన కారణం. బ్రహ్మరాక్షసి స్వతహాగా ఎటువంటిదైతే కుంగిపోయినవాళ్ళ మీదికి వెళుతుంది?" అన్నారు గురువుగారు.

"అది పిరికిదై ఉండాలి... నీచమైనదయి ఉండాలి... నిజంగా బలం గలది కాదై ఉండాలి" అని రకరకాలుగా జవాబిచ్చాం.

గురువుగారు మా జవాబు లన్నిటికీ తల ఒగ్గారు.

"అయితే మరి; గురువుగారూ! ఈ బ్రహ్మరాక్షసులు చేసే దారుణకృత్యాలు అమానుషంగా ఉన్నాయే. ఇవి ప్రజల రక్తాన్ని ఇట్లా ఏర్లుగట్టి పారిస్తున్నాయే. ఇంత హింసాకాండ నడిపిస్తున్నాయే. ఇంత బీభత్సం కలిగిస్తున్నాయే. పిరికివాళ్ళకీ, బలహీనులకీ ఇంతశక్తి ఎట్లావస్తుందండీ?" అని అడిగాం.

"చావు కళ్ళజూసే పిల్లిని చూశారా? ఎంత బీభత్సంగా తయారవుతుందో?" అన్నారు గురువుగారు.

"అటువంటి పిల్లికూడా కనపడినంత బీభత్సంగా ప్రవర్తించదే?" అన్నాం.

"ఈ బ్రహ్మరాక్షసులకు పిరికితనంతోపాటు, ఆ శక్తితోపాటు, దుర్జనత్వంతోపాటు ఇతర మద్దతు కూడా ఉంది" అన్నారు గురువుగారు.

"ఏమిటండీ ఆ మద్దత్తూ?" అని అడిగాం.

"అది చెబితే వినవలసిందికాదు, చూడవలసిందే! రండి నా వెంట" అన్నారు గురువుగారు.

గురువుగారి వెంట బయల్దేరాం.

ఒకచోట భూతమాంత్రికులు పోగై ఉన్నారు. వారిని చూస్తేనే మా ప్రాణాలు లేచివచ్చినాయి. వారి వాలకాలూ, వేషభాషలూ ఎటువంటి పిశాచాలనైనా పారదోలేటందుకు తాహతుగలవిగా కనిపించినై. వారి ధ్వజాలమీద "ఉత్తిష్ఠంతు భూత పిశాచాః" అనీ "సర్వే జనా స్సుఖినో భవంతు" అనీ అక్షరాల్తో ఉంది. బ్రహ్మరాక్షసుల బలం నిరూపించటానికి గురువుగారు మమ్మల్ని ఇక్కడకెందుకుతెచ్చారా అని మాలో మేం చాలా ఆశ్చర్యపడి పోయినాం.

మా విస్మయం గ్రహించి గురువుగారు, "కాస్త వారి సంభాషణ ఆలకించండి" అన్నారు. గురువుగారి ఆదేశానుసారం భూత మాంత్రికుల సంభాషణ చెవి ఒగ్గి విన్నాం.

"వెనకటికీ ఇప్పటికీ పరిస్థితులు మారాయి. మన బ్రహ్మరాక్షసులని మనం బలపరచాలి. వాళ్ళు మనవాళ్ళు. వాళ్ళే మనం. మనమే వాళ్ళు. మనం పోరాడవలసింది పైనుంచి అవాహన అయ్యే బ్రహ్మరాక్షసుల్తో!" అంటున్నాడొక గణాచారి.

"నిన్ననే మనబొర్ర బ్రహ్మరాక్షసిగారు నాతో ఏమని సెలవిచ్చారంటే ఈ వీర భేతాళరాయళ్ళను హతమార్చటానికి కొన్ని ఆలోచనలు చేశామన్నారు" అన్నాడు మరో పిశాచ భయంకరుడు.

"ఇటువంటి బ్రహ్మరాక్షసులు మనవేపుండటం ఎంత మంచిదయిందిరా?" అన్నాడు మరో పిందె.

"అయ్యా గురువుగారూ, వీరెవరూ బ్రహ్మ రాక్షసులను మారణహోమం చేసే ప్రయత్నంలో లేరే. ఇంతకన్న పెద్ద కార్యక్రమంలో ఉన్నారా ఏమిటి? పైనుంచి ఆవాహన అయిన బ్రహ్మ రాక్షసులున్నాయటగా?" అన్నాం.

"అవును అవి యిక్కడ బ్రహ్మరాక్షసుల అతిథులే. వాటి మారణ హోమంకూడా జరగవలసిందే. ఆ విషయం కూడా మన భూతమాంత్రికుల అభిప్రాయాలు విందాం. ఉండండి" అన్నారు గురువుగారు.

"వాళ్ళదేముందిరా? పొండి అని అందరమూ ఒక్కసారి పెడబొబ్బపెడితే పుంజాలు తెంచుకుని పరిగెత్తరూ? అసలు పోతామని వాళ్ళే అంటున్నారు. మనకెందుకొచ్చిన కంఠశోష? అసలు మనం మారణహోమం చెయ్యవలసింది ఈ భేతాళరాయళ్ళని" అన్నాడు మరో చింపిరితల.

"ఎవరండీ ఈ భేతాళ రాయళ్ళూ?" అన్నాం.

"వాళ్ళూ బ్రహ్మరాక్షసులను వేటాడేవాళ్ళే" అన్నారు గురువుగారు.

"మరి వాళ్ళకూ వీళ్ళకూ తగువు ఏం?" అన్నాం.

"వాళ్ళు ముగ్గులేసి హ్రీం హ్రాం హ్రూం అనరు. బ్రహ్మ రాక్షసుల పీడకు గురి అయిన వాళ్ళ దగ్గిరికిపోయి ధైర్యం ఇస్తారు. వాటి నెదుర్కొనే సాధనాలు చెబుతారు.

"ఈ భేతాళరాయళ్ళ మూలంగానే ప్రజలు నిష్కారణంగా అల్లాడి పోతున్నారు. ప్రజలు నోరుమూసుక్కూచుంటే బ్రహ్మ రాక్షసులకింత కోపం రాకపోను. "సర్వే జనాస్సుఖినో భవంతు" అనే మన నినాదానికి వీళ్ళు వ్యతిరేకంగా ఉన్నారు. "ఉత్తిష్ఠంతు భూత పిశాచా" అనేది మాత్రం మన దగ్గిర నేర్చుకున్నారు. భేతాళరాయళ్ళు నశించాలి. దేశంలో శాంతి రావాలి." అన్నాడొక భూత మాంత్రిక శ్రేష్ఠి.

"వీళ్ళు చెప్పే ముక్కలో అర్థం ఉందాండి గురువుగారూ? బ్రహ్మరాక్షసిని చంపిన కొద్దీ దాని బలం హెచ్చిపోతుందంటాడేమిటి యీ అబ్బి?" అన్నాం.

"అంతే వాళ్ళ ముక్కల్లో వున్న అర్థం" అన్నారు గురువుగారు.

"అయితే గురూజీ, మాకు ఒక బ్రహ్మరాక్షసిని చూపిస్తారా" అని అడిగాం.

"ఒకటేమిట్రా? వంద చూపిస్తాను. రండి నావెంట" అన్నారు గురువుగారు.

ఒక బ్రహ్మ రాక్షసిని ఇద్దరు పట్టుకొచ్చి కారులో ఎక్కిస్తున్నారు. "సీ, యెదవా! సగం బుడ్డీ అయినా యేశావుకావు. సరిగా పట్టుకోలేవేం?" అంటున్నది పప్పుజారినట్టు జారుతూ.

ఇంకోచోట ఇంకో బ్రహ్మరాక్షసి ఒక బోగందాని ఒళ్ళో మొహంపెట్టి వెక్కి వెక్కి ఏడుస్తూ "నూ రేపెల్లావంటే సచ్చిపోతానే!" అంటున్నది.

మరోచోట మరోబ్రహ్మరాక్షసి తన యాభైవేల రూపాయల కారులో వెనకాలసీటులోకి గుర్రప్పిల్లనెక్కిస్తూ "బద్ధరం బద్ధరం" అని కేకవేస్తున్నది.

మేం ఆశ్చర్యంతో నిర్ఘాంతపడి, "ఇవేనా గురూజీ బ్రహ్మరాక్షసులు?" అని అడిగాం.

"ఇవి బ్రహ్మరాక్షసులు కాకపోతే బ్రహ్మరాక్షసి అనేది ఎక్కడా లేదు" అన్నారు గురువుగారు.

"దయ్యం అబద్ధం. దయ్యాన్ని కొట్టే దెబ్బలు నిజం" అన్నాడు మాలో ఒకడు.

"గంగానమ్మ జాతర్లల్లేనే ఈ బ్రహ్మరాక్షసి కొలుపులు కూడా ఆచారంగా సాగుతున్నాయి. ఒక్క శాసనంతో రెండూ చెల్లు!" అన్నాడు మాలో మరొకడు.

"ఆ శాసనం జరక్కుండా అడ్డుపడేదే బ్రహ్మరాక్షసి. ఇప్పుడు చెప్పండి బ్రహ్మ రాక్షసి నిజమా, అబద్ధమా?" అన్నారు గురువుగారు.

మేం ఆలోచనలో పడ్డాం.

*ముద్రణ: దుక్కిటెద్దు, కథల సంపుటి, 1955 - 59 మధ్య?*

*జయా పబ్లికేషన్స్, విజయవాడ*